స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

భీమవరం :కేంద్ర ప్రభుత్వం స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేశారని, అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిఆర్ఒ కె.కృష్ణవేణి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవెల్ పరీక్షలు 2023 పోటీ పరీక్షలను లోయర్ డివిజన్ క్లర్క్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్టు తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి జూన్ ఎనిమిది చివరి తేదీగా ఉందన్నారు. ఇంటర్ ఉత్తీర్ణత పొందిన నిరుద్యోగ యువతకు ఇది చక్కటి అవకాశం అని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు SSC.nic.in వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇవి కంప్యూటర్ బేస్డ్ పరీక్షలని, ఆగస్టులో నిర్వహించడం జరుగుతుందన్నారు. దేశంలో 22 పట్టణాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, వీటిలో అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లో 10 పరీక్షా కేంద్రాలను, పాండిచ్చేరిలో ఒకటి, తమిళనాడులో ఎనిమిది, తెలంగాణలో 3 ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

నేడే జెడ్‌పి ఛైర్మన్ ఎన్నిక

ఛైర్మన్‌గా పెదపాడు జెడ్‌పిటిసి సభ్యురాలు పద్మశ్రీకి బి-ఫారం
ఇక ఎన్నిక లాంఛనమే..
ఏలూరు జిల్లాకు దక్కిన పదవి
ప్రస్తుత ఛైర్మన్ శ్రీనివాస్ రాజీనామాతో ఎన్నిక
ప్రత్యేక సమావేశంలో ఎన్నుకునేందుకు కలెక్టర్ ఏర్పాట్లు
39 నెలలు పదవిలో ఉండనున్న కొత్త ఛైర్మన్
23 ఏళ్ల తర్వాత రెండో మహిళా జెడ్‌పి ఛైర్మన్‌గా పద్మశ్రీ



జెడ్‌పి సిఇఒ రవికుమార్ నుంచి బి ఫారం అందుకుంటున్న జెడ్‌పిటిసి పద్మశ్రీ

పెదపాడు జెడ్‌పిటిసి సభ్యురాలు పద్మశ్రీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎన్నిక గురువారం ఉదయం 11 గంటలకు జరగనుంది. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో గురువారం జిల్లా పరిషత్ సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి జిల్లా కలెక్టర్ ఎన్నిక జరపనున్నారు. జెడ్‌పి నూతన ఛైర్మన్‌గా పెదపాడు జెడ్‌పిటిసి సభ్యులు గంటా పద్మశ్రీకి వైసిపి అధిష్టానం బి ఫారం ఇవ్వడంతో ఛైర్మన్ ఎన్నిక లాంఛనంగానే సాగనుంది. నూతన ఛైర్మన్ ఎన్నికకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. పెదపాడు నుంచి పెద్దఎత్తున మోటార్ సైకిల్ ర్యాలీగా పద్మశ్రీ జిల్లా పరిషత్‌కు సమావేశానికి రానున్నారు. 2021 ఏప్రిల్ ఎనిమిదో తేదీన జిల్లాలో జెడ్‌పిటిసి ఎన్నికలు జరిగాయి. కోవిడ్ విజృంభణ, కోర్టు కేసుల నేపథ్యంలో కౌంటింగ్ ప్రక్రియ మాత్రం దాదాపు ఏడునెలల అనంతరం సెప్టెంబర్ 19వ తేదీన జరిగింది. ఈ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 48 జెడ్‌పిటిసి స్థానాలు ఉండగా 46చోట్ల వైసిపి అభ్యర్థులే గెలిచారు. దీంతో జెడ్‌పి ఛైర్మన్ పదవి వైసిపికే దక్కింది. జిల్లాపరిషత్ ఛైర్మన్ పదవి బిసి సామాజిక తరగతికి కేటాయించారు. దీంతో ఎన్నికలకు ముందే జిల్లా పరిషత్ ఛైర్మన్ అభ్యర్థిగా యలమంచిలి జెడ్‌పిటిసి సభ్యులు కవురు శ్రీనివాస్‌ను వైసిపి ప్రకటించింది. అత్యధిక స్థానాలు వైసిపి కైవసం చేసుకోవడంతో సెప్టెంబర్ 25వ తేదీన జిల్లా ప్రథమ పౌరునిగా కవురు శ్రీనివాస్ అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈయన దాదాపు 20 నెలలు ఛైర్మన్ పదవిలో ఉన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల్లో కవురు పోటీచేసి గెలిచారు. మే 14వ తేదీన జెడ్‌పి ఛైర్మన్ పదవికి రాజీనామా చేసి 15వ తేదీన ఎంఎల్‌సిగా ప్రమాణ స్వీకారం చేశారు.

22 రోజులుగా ఛైర్మన్ పదవి ఖాళీ

జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా కవురు రాజీనామా చేసి దాదాపు 22 రోజులు గడిచింది. అప్పటి నుంచి జిల్లా పరిషత్ ఛైర్మన్ కుర్చీ ఖాళీగానే ఉండిపోయింది. జిల్లా ప్రథమపౌరుని ఎన్నికలో నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. నిబంధనల ప్రకారం వెంటనే వైస్ ఛైర్మన్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించాల్సి ఉన్నప్పటికీ అది జరగలేదు. దీంతో జెడ్‌పి ఛైర్మన్ ఎన్నికపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మీడియాలో పెద్దఎత్తున కథనాలు రావడంతో ఎన్నికల కమిషన్ దృష్టికి అధికారులు సమస్యను తీసుకువెళ్లారు. దీంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి గురువారం జెడ్‌పి ఛైర్మన్ ఎన్నిక నిర్వహిస్తున్నారు. జెడ్‌పి ఛైర్మన్ పదవి బిసి సామాజిక తరగతికి కేటాయించంతో అదే తరగతికి చెందిన పెదపాడు జెడ్‌పిటిసి సభ్యులు గంటా పద్మశ్రీని ఛైర్మన్‌గా వైసిపి అధిష్టానం ఎంపిక చేసింది.

నూతన ఛైర్మన్ ముందు సవాళ్లెన్నో

జెడ్‌పి నూతన ఛైర్మన్ అనేక సవాళ్లను ఎదర్కోనున్నారు. జిల్లావ్యాప్తంగా జెడ్‌పి ఆధ్వర్యంలోని రోడ్లన్నీ తీవ్రంగా దెబ్బతిన్నాయి. అనేక సమావేశాల్లో జిల్లా పరిషత్ సభ్యులు ఈ సమస్యను ప్రస్తావిస్తున్నారు. అంతేకాకుండా జిల్లా పరిషత్ పరిధిలోని దుకాణాలు, భూములకు సంంధించిన లీజుల పెండింగ్ ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు. లీజు సొమ్ము వసూలు చేస్తే జిల్లా అభివృద్ధికి ఉపయోగపడనున్నాయి. అంతేకాక జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టే వివిధ పనులకు సంబంధించి నిధులు కేటాయింపులు జరగాల్సి ఉంది. ముఖ్యంగా జిల్లా పరిషత్ కార్యాలయంలో అధికారుల తీరు ఇష్టారాజ్యంగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జెడ్‌పిటిసి సభ్యులకు కనీస గౌరవం ఇవ్వడం లేదంటూ గగ్గోలు పెడుతున్నారు. దీనిపై నూతన ఛైర్మన్ ప్రధానంగా దృష్టిసారించాల్సి ఉంది.

బిసి సామాజిక తరగతికి చెందిన జెడ్‌పిటిసిలు తొమ్మిది మంది ఉన్నప్పటికీ ఆదినుంచి పద్మశ్రీ పేరునే ప్రముఖంగా వినిపించింది. అదే సమయంలో మహిళాకు పెద్దపీఠ వేస్తున్నట్లు సైతం పార్టీ అధిష్టానం ప్రకటించింది.

చక్రం తిప్పిన అబ్బాయిచౌదరి

జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా పెదపాడు జెడ్‌పిటిసి ఎంపిక కావడంలో దెందులూరు ఎంఎల్‌ఎ అబ్బయ్య చౌదరి కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. అన్ని పదవులు విభజిత పశ్చిమగోదావరి జిల్లా నాయకులకు వెళ్లడంతో ఛైర్మన్ పదవి ఏలూరు జిల్లాకు ఇవ్వాలని ఆయన గట్టి పట్టుపట్టినట్లు సమాచారం. అంతేకాకుండా ఆయన నియోజకవర్గమైన పెదపాడు జెడ్‌పిటిసిని ఛైర్మన్ చేసేందుకు తీవ్రంగా కృషిచేసినట్లు తెలిసింది. ఏలూరు జిల్లాలో బలమైన అభ్యర్థిగా ఉన్న పద్మశ్రీని అధిష్టానం ఎంపిక చేసింది. ఛైర్మన్‌గా ఎంపిక చేస్తూ బిఫారం కూడా ఇవ్వడంతో ఎన్నిక లాంఛనమే అని చెప్పొచ్చు. కొత్తగా ఛైర్మన్ బాధ్యతలు చేపట్టనున్న పద్మశ్రీ ఇంకా మూడేళ్లకు పైగా ఈపదవిలో ఉండనున్నారు. అనూహ్యంగా ఛైర్మన్ పదవి వరించడంతో పద్మశ్రీ అనుయాయులు, పార్టీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెండో మహిళా జెడ్‌పి ఛైర్మన్‌గా పద్మశ్రీ

1936లో జిల్లా పరిషత్ ఏర్పాటు నుంచి ఇప్పటి వరకూ 21 మంది ఛైర్మన్లుగా పనిచేశారు. నూతన ఛైర్మన్‌గా ఎన్నిక కానున్న గంటా పద్మశ్రీ 22వ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. అంతేకాక ఇప్పటి వరకూ జెడ్‌పి ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన మహిళ ఒక్కరే. 1995 నుంచి 2000 సంవత్సరం వరకూ ఇమ్మణి రాజశ్వేరి ఛైర్మన్‌గా ఉన్నారు. అంతకు ముందుగానీ, తర్వాత గానీ జెడ్‌పి ఛైర్మన్‌గా మహిళలు ఎవరూ ఎన్నిక కాలేదు. నూతనంగా ఎన్నిక కానున్న పద్మశ్రీ రెండో జెడ్‌పి మహిళా ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఉపాధి హామీ చట్ట పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలి

ప్రజాశక్తి - పెంటపాడు

ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, దశలవారీగా ఉపాధి పనులను కూలీలకు దూరం చేస్తోందని, చట్ట పరిరక్షణకు కూలీలంతా ఏకమై ఐక్యంగా ఉద్యమించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చీర్ల పుల్లారెడ్డి, కండెల్లి సోమరాజు పిలుపునిచ్చారు. మండలంలోని రాచర్లలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను బుధవారం పరామర్శించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయించిన రూ.272 కూలి కూడా ఎక్కడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పే స్లిప్పులు ఇవ్వకపోవడంతో వారానికి ఎంతకూలి పడిందో కూడా తెలియడం లేదన్నారు. గతేడాది చేసిన పనులకు సంబంధించిన బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని, ఈ ఏడాది కూడా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని కూలీలు నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం నేతలు మాట్లాడుతూ చట్ట ప్రకారం 15 రోజులకే వేతనాలు ఇవ్వాలని నిబంధన ఉందని కానీ ఆ విధంగా బిల్లులు పడటం లేదన్నారు. ఉపాధి హామీ నిర్వీర్యానికి కేంద్రం పూనుకుంటుందని, ఈ చట్టాన్ని కాపాడుకునేందుకు కూలీలంతా ఐక్యతతో పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయలను కూడా రద్దు చేశారని, వాటిని పునరుద్ధరించాలని కోరారు. వేసవి అలవెన్సులు చెల్లించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగం పెరగడంతో డిగ్రీలు, బిటెక్, ఎంటెక్, ఎంసిఎ చదివినవారు కూడా ఉపాధి పనులకు వస్తున్నారన్నారు. ఇలాంటి చట్టాన్ని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని, ఈ క్రమంలోనే బడ్జెట్‌లో నిధులు తగ్గించిందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఉపాధి కూలీలంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు వేసి గద్దె దింపడం ఖాయమన్నారు. చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేసి ఎక్కడికక్కడ కూలీలు నిరసన తెలియజేసి ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముళ్లపూడి లక్ష్మణరావు, పి.కృష్ణ, కోలా దుర్గాభవాని, తమ్మయ్య, పసుమర్తి సుబ్బారావు, దున్న జాన్, కొండపల్లి నాగజ్యోతి, ఆర్.పద్మ, పి.రమణ, సోమలాపూర్, రాము పాల్గొన్నారు.

నిత్యం ప్రజలకు అందుబాటులోనే..

ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రజల నమ్మకాన్ని తాను ఏనాడూ వమ్ము చేయలేదని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ స్పష్టం చేశారు. 2019 ఎన్నికల్లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇక్కడ పోటీ చేసినప్పటికీ తాను స్థానికుడినని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని, అభివృద్ధి జరగాలనే పట్టుదలతో ఉంటానని నియోజకవర్గ ప్రజలు భావించి తనను గెలిపించారన్నారు. వారి నమ్మకాన్ని పూర్తిస్థాయిలో నిలబెట్టుకున్నానని ఆయన పేర్కొన్నారు. బుధవారం భీమవరం రెండో పట్టణంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా 33వ వార్డులో రూ.41.50 లక్షలతో శ్రీరాంపురం పంట కాలువ వద్ద నుంచి డిఎన్ఆర్ కాలేజీ రోడ్డు హన్సి కళ్యాణ మండపం వరకూ నిర్మించిన బిటి రోడ్డు, సీసీ డ్రెయిన్, ఆర్‌టిసి స్లాబ్ కల్వర్టును ప్రారంభించారు. అనంతరం 31వ వార్డు బలుసుమూడిలో రూ.కోటీ లక్ష 50 వేలతో నిర్మించే కొత్త రామాలయం నుండి ఆదిత్య జూనియర్ కాలేజీ వరకూ సీసీ రోడ్డు, డ్రెయిన్, కల్వర్ట్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భీమవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రజల కోరిక మేరకు జరుగుతున్న నియోజవర్గ అభివృద్ధికి ప్రతిపక్షాలు సహకరించాలన్నారు. ఒకవేళ తప్పులు జరిగితే ఆ తప్పులను తన దృష్టికి తేవాలన్నారు. ప్రజలు చైతన్యవంతులని, తమ ప్రాంతాల్లో అభివృద్ధిపై తన దృష్టికి అనేక సమస్యలను తీసుకొచ్చారని తెలిపారు. భీమవరం నియోజకవర్గంలో నవరత్నాల రూపంలో ప్రజలకు ఈ నాలుగేళ్ల కాలంలో 1200 కోట్ల మేర లబ్ది జరిగిందన్నారు.

రహదారులు బాగు చేయించండి

ఎంఎల్‌ఎ వద్ద మహదేవపట్నం వాసుల ఆవేదన

ప్రజాశక్తి - ఉండి

తమ గ్రామంలో రహదారిని బాగు చేయించాలని ఎంఎల్‌ఎ మంతెన రామరాజు వద్ద మహదేవపట్నం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మహదేవపట్నం గ్రామ పరిధి రామచంద్రపురంలో పర్యటించిన మంతెన రామరాజుతో గ్రామస్తులు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా రామచంద్రపురం రహదారి పూర్తి అధ్వాన స్థితిలోకి మారడమే కాకుండా ఇటీవల కురిసిన వర్షాలతో రహదారి చెరువులా తయారైందన్నారు. రహదారిని బాగు చేయించాలని ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోయిందని మంతెన రామరాజు వద్ద గ్రామస్తులు వాపోయారు. వృద్ధులు, గర్భిణులు ఈ రహదారిలో ప్రయాణించాలంటే నరకప్రాయంగా మారిందన్నారు. అనంతరం ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అధికారులతో చరవాణిలో మాట్లాడుతూ రామచంద్రాపురం రహదారిని బాగు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు జుత్తిగ శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు చెన్నంశెట్టి హరి నాయుడు, నాయకులు వనిమా శ్రీనివాస్, గంధం బుజ్జి పాల్గొన్నారు.

రామచంద్రపురంలో పర్యటిస్తున్న ఎంఎల్‌ఎ మంతెన రామరాజు

హామీ నెరవేర్చకపోవడం దారుణం : సిఐటియు

ప్రజాశక్తి - అత్తిలి

కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న వారందరినీ అధికారంలోకి వచ్చిన మరుక్షణమే రెగ్యులర్ చేస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల ముందు హామీ ఇచ్చారని, నాలుగేళ్లు కావస్తున్నా నేటికీ హామీ నెరవేరకపోవడం దారుణమని సిఐటియు మండల కమిటీ ఆక్షేపణ వ్యక్తం చేసింది. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఈపు శ్రీనివాసు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు హాజరై ప్రసంగించారు. కాంట్రాక్టు వ్యవస్థలో సంవత్సరాల తరబడి పనిచేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేస్తానని గతంలోనే రాష్ట్ర పాలకులు ప్రకటించారన్నారు. పంచాయతీ రెవెన్యూ విద్యుత్తు ఇలా అనేక డిపార్ట్‌మెంట్లో కాంట్రాక్టు ఉద్యోగులు సంవత్సరాల తరబడి పనిచేస్తున్నారని, వారికి కనీస వేతనాలు, సెలవులు, సమయపాలన లేకుండా వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని తెలిపారు. పంచాయతీల్లో అయితే అన్ని రకాల పనులూ చేయాల్సి వస్తుందన్నారు. వయసంతా కాంట్రాక్టులోనే గడిచిపోతే ఇతర సౌకర్యాలు పొందేది ఎప్పుడు, ఇది చట్ట విరుద్ధం కాదా అనే ప్రశ్న తలెత్తుతోందన్నారు. ప్రభుత్వమే చట్ట విరుద్ధంగా పోయినప్పుడు ప్రయివేటులో పనిచేస్తున్న వారికి దిక్కు ఎవరని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎన్నికల వాగ్దానంలా కాకుండా కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బి.సత్యనారాయణ, గ్యాస్ వర్కర్స్ యూనియన్ నాయకులు రమేష్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి దీపిక, సత్యవతి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు మల్లేశ్వరి, శారద, పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న కెవిపిఎస్ నాయకులు

పేదలపై దాడులను తిప్పికొడతాం

చించినాడ బాధితులకు కెవిపిఎస్ నాయకుల పరామర్శ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దళితులపై ఎన్ని దాడులు చేసినా వాటిని ఎదుర్కొంటూనే చించినాడ పెరుగులంక భూములను కాపాడుకుంటామని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు స్పష్టం చేశారు. చించినాడ లంకభూముల్లో మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకు ప్రయత్నించిన దళితులు, బిసిలు నిరుపేదలపై పోలీసులు చేసిన లాఠీఛార్జిలో గాయపడి తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్, జిల్లా నాయకులు కానేటి బాలరాజు, లంక భూముల పోరాట నాయకులు స్టాలిన్, శ్రీనివాస్‌ను బుధవారం కె.క్రాంతి బాబు, జిల్లా సహాయ కార్యదర్శి చిన్నం చిన్న నాగేశ్వరరావు కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా క్రాంతి బాబు మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఉమ్మడి వ్యవసాయం చేస్తున్న దళితులకు, బిసిలకు చెందిన డిఫారం పట్టా భూములను ఆనుకొని ఉన్న పెరుగులంక భూముల్లో అధికారుల అక్రమ తవ్వకాలు చేపట్టడం అన్యాయమన్నారు. సుమారు ఆరు నెలలుగా ఈ తవ్వకాలను ఆపాలని మండలస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎంత విన్నవించుకున్నా దళితులను, బిసిలను చిన్నచూపే చూశారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని నెలలుగా దళితపేటలో పోలీస్ పహారాతో అధికారులు పేద ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం వందలాది పోలీసుల మధ్య ఇసుకను తరలిస్తున్న లారీలను ఆపాలని కోరిన దళితులపై, మహిళలపై, పేద ప్రజలపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీఛార్జి చేయడం దారుణమన్నారు. నలుగురికి తీవ్ర గాయాలు కావడంతో తాడేపల్లిగూడెం ప్రభుత్వా సుపత్రిలో చికిత్స పొందుతున్నారని, సుమారు 31 మందిపై అక్రమ కేసులు బనాయించడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు.

చించినాడ లంక భూముల సమస్యపై కనీస అవగాహన లేని ప్రజాప్రతినిధి కవురు శ్రీనివాస్ ఆడంబరంగా భూస్వాములకు తొత్తులుగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి మండలాల్లో గోదావరి పరివాహక ప్రాంతాల్లో పెరుగులంక భూములు కొన్ని వందల ఎకరాలు భూస్వాముల చేతుల్లో మూలుగుతుంటే ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్ రాజు, ఎంఎల్‌సి కవురు శ్రీనివాసుకు కనబడలేదా అని ప్రశ్నించారు. త్వరలో అన్ని దళిత, బిసి, ప్రజా సంఘాలతో కలిసి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని ఆయన హెచ్చరించారు.

యలమంచిలి: చించినాడలో దళితులపై పోలీసులు విచక్షణారహిత లాఠీఛార్జిలో గాయపడిన వారిని సిపిఎం నేతలు బుధవారం పరామర్శించారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, జెఎన్‌వి.గోపాలన్, జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, భాతిరెడ్డి జార్జి, ముచ్చర్ల త్రిమూర్తులు తదితర నాయకులు బాధిత దళిత కుటుంబాల వారిని పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. వారి వెంట స్థానిక నాయకులు దేవ సుధాకర్, సరిపల్లి జయప్రభ, గొల్ల ఏడుకొండలు, చెల్లుబోయిన వడ్డీకాసులు, శెట్టిమి భాస్కరరావు, శెట్టిమి నాగమణి, ముస్కాడి జయశ్రీ, కేతా రాము, మురాల రాజేష్, విప్పర్తి నన్ని, జైసింగ్, ఉదయ్ ఉన్నారు.

చించినాడలో దళిత మహిళ బొజ్జమ్మను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

లాఠీఛార్జి దారుణం

భీమవరం: చించినాడలోని పెరుగులంక భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలు నిలిపివేయాలని శాంతియుతంగా ఉద్యమిస్తున్న దళితులపై, వారికి అండగా నిలిచిన పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడుపై, సిపిఎం నాయకులపై లాఠీచార్జి చేసి అక్రమంగా అరెస్టు చేసి స్టేషన్లలో నిర్బంధించడం అమానుషమని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు తీవ్రంగా ఖండించారు. బుధవారం భీమవరం ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో భీమారావు మాట్లాడుతూ పోలీసులు మహిళలను సైతం ఈడ్చుకుంటూ వెళ్లడం అత్యంత దారణమన్నారు. ప్రజా ఉద్యమాలను లాఠీ ఛార్జీలు, అరెస్టులు, నిర్బంధాలతో అణచివేయాలనుకోవడం దురదృష్టకరమన్నారు. బి.ఫారం పట్టాలుపొంది సుమారు 70 సంవత్సరాలుగా దళితులు సాగుచేసుకుంటున్న భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలు జరిపి దళితుల భూములు సాగుకు పనికిరాకుండా చేయడం అన్యాయమన్నారు. దళితులు పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఈచర్య అద్దం పడుతుందన్నారు. దళిత సంక్షేమం పట్ల వైసిపి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా దళిత భూముల్లో అక్రమతవ్వకాలు నిలిపివేయాలని, ఇప్పటి వరకూ తరలించిన మట్టికి నష్టపరిహారం చెల్లించాలని భీమారావు డిమాండ్ చేశారు. పెరుగులంక భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలకు వ్యతిరేకంగా దళితుల సాగిస్తున్న న్యాయ పోరాటానికి సిపిఐ సంపూర్ణ మద్దతు, సంఘీభావం తెలుపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్ పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

నాడు - నేడు పనులు నాణ్యంగా ఉండాలి

ప్రజాశక్తి - భీమవరం/ భీమవరం రూరల్

నాడు-నేడు పనులు నాణ్యంగా ఉండాలని, లేకుంటే తగిన చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. పట్టణంలోని పలు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలల్లో 'నాడు - నేడు' పనులను ప్రశాంతి బుధవారం పరిశీలించారు. పట్టణ పరిధిలో ఉన్న రాజరాజేశ్వరి మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, టిఎస్ఎస్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న పనులను ఆమె క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. పనులు త్వరితగతిన సకాలంలో పూర్తి చేయాలన్నారు. పూర్తి స్థాయిలో నాణ్యతా ప్రమణాలు పాటించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పాఠశాల కమిటీలు, ప్రధానోపాధ్యాయులు పనులు నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చెప్పటిన నాడు-నేడు పనులు ద్వారా పాఠశాలల రూపు రేఖలు మారుతున్నాయన్నారు.

సచివాలయాల్లో విస్తృత తనిఖీలు

అనంతరం పట్టణ పరిధిలోని 23, 36 వ వార్డు సచివాలయాలను, కొమరాడ గ్రామం సచివాలయాన్ని కలెక్టర్ ప్రశాంతి ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయం బయట డిస్‌ప్లే చేసిన సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల జాబితాను పరిశీలించి, అధికారులకు, సిబ్బందికి కలెక్టరు పలు సూచనలు చేశారు. రికార్డులను పరిశీలించారు. శాఖల వారీగా సచివాలయ ఉద్యోగులను వర్క్ ప్లాన్ అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో భాగంగా ఆమె సిబ్బందితో మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో ఆశాజనికమైన ఫలితాలు లేవని, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సేవలను నిరుపేదల ఇంటివద్దకు తీసుకెళ్లేందుకు గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిందని, ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చే దిశగా సిబ్బంది పనిచేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారి జాబితాలను పథకాలు వారీగా నోటీసు బోర్డులో ఉంచాలని, అదేవిధంగా అనర్హుల జాబితాను కూడా నోటీసు బోర్డులో ఉంచాలని సూచించారు. ప్రతీరోజు సచివాలయ పరిధిలో స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలపై వినతులు స్వీకరించాలని, వాటిని అదేరోజు సంబంధిత శాఖల అధికారులకు పరిష్కారం నిమిత్తం పంపించాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని అందించాలన్నారు. సచివాలయ ఉద్యోగులు, వార్డు వాలంటీర్లు సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని ఆమె అన్నారు. ఎక్కడ ఏ సమస్య వచ్చినా పరిష్కరించే స్థాయిలో ఉండాలని, ఏ చిన్న ఫిర్యాదు లేకుండా చక్కగా విధులు నిర్వర్తించాలని ఆమె సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ, డిఎంఅండ్‌హెచ్ఒ డి.మహేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, మేనేజింగ్ ఇంజనీర్ పి.త్రినాథరావు, డిఇ నారాయణరావు, పబ్లిక్ హెల్త్ డిఇ విజయ్, ఎఇలు రవితేజ, శ్రీనివాస్, విద్యా కమిటీ ఛైర్మన్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ద్రావణం పంపిణీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

వడగాల్పులకు పడకుండా ఓఆర్ఎస్ ద్రావణాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నట్లు మార్టేరు పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ కె.కార్తీక అన్నారు. జాతీయ ఐడిసిఎఫ్‌లో భాగంగా బుధవారం మండలం పరిధిలోని పిహెచ్‌సి పరిధిలోని ఆరోగ్య కేంద్ర పరిధిలో, అంగన్‌వాడీ సెంటర్లలో ఓఆర్ఎస్ ద్రావణాన్ని ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా నెగ్గిపూడి హెల్త్ సెంటర్ వద్ద ఓఆర్ఎస్ ద్రావణాన్ని ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా కార్తీక మాట్లాడుతూ చలి

నరసింహమూర్తి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - గణపవరం

అనారోగ్యంతో ఇటీవల మరణించిన వరదరాజపురం గ్రామ సర్పంచి కొండేటి నరసింహమూర్తి కుటుంబ సభ్యులను బుధవారం జనసేన ఉంగుటూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి పచ్చమట్ల ధర్మరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసింహమూర్తి గ్రామ సర్పంచిగా గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన వ్యక్తి అన్నారు. కుటుంబ సభ్యులకు జనసేన అండగా ఉంటుందన్నారు. ఆయన నరసింహమూర్తి మృతికి తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తోట పవన్, తోట శ్రీను, తానేటి జోగేశ్వరరావు పాల్గొన్నారు.వేంద్రం వలే ఆరోగ్య కేంద్రం నుంచి కూడా ప్రతిరోజూ 20 ఓఆర్ఎస్ ప్యాకెట్లను స్వచ్ఛమైన నీటిలో కలిపి ప్రజలకు అందించడం జరుగుతుందని చెప్పారు. ఈ ద్రావణం వల్ల వడగాల్పుల నుండి రక్షణ పొందడం జరుగుతుందన్నారు. ఈ నెల 17వ తేదీ వరకూ ఈ ద్రావణాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రామకృష్ణ, ఎఎన్ఎం పి.మాధవి, ఎంఎల్‌హెచ్‌పి సంధ్య, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


వెండి కిరీటం అందజేస్తున్న మాజీ ఎంపిపి వెంకటేశ్వరరావు

పరాలమ్మకు వెండి కిరీటం బహూకరణ

ప్రజాశక్తి - కాళ్ల

గ్రామ దేవత పరాలమ్మకు లక్ష రూపాయల విలువైన వెండి కిరీటాన్ని మందపాటి పేర్రాజు కుటుంబ సభ్యులు బహూకరించడం అభినందనీయమని మాజీ ఎంపిపి కందుల వెంకట మల్లికార్జునరావు అన్నారు. లక్ష్మీ నరసింహపురం గ్రామంలో గ్రామ దేవత పరాలమ్మ అమ్మవారి జాతర బుధవారం వైభవంగా నిర్వహించారు. మందపాటి పేర్రాజు కుటుంబ సభ్యులందరూ కలిసి అమ్మవారికి లక్ష రూపాయల విలువైన వెండి కిరీటాన్ని మాజీ ఎంపిపి కందుల వెంకట మల్లికార్జునరావు చేతుల మీదుగా అందజేశారు. శనివారం అమ్మవారి జాతర సందర్భంగా ఊరేగింపు, ఆదివారం అన్న సమారాధన నిర్వహించనున్నామని పరాలమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, గ్రామ సర్పంచి తానింకి నాగరాజు, బొండాడ పేట సర్పంచి గోళ్ల పండు, ఎంపిటిసి సత్యనారాయణ, మందపాటి పేర్రాజు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ఇ-ఫిష్ నమోదు

ప్రజాశక్తి - కాళ్ల

ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆక్వా సాగుకు సంబంధించి ఈ-ఫిష్ నమోదు ప్రక్రియ నిర్వహిస్తున్నామని మండల మత్స్యశాఖ అధికారి సిహెచ్.రాంబాబు తెలిపారు. ఈ-ఫిష్ నమోదు చేయని ఆక్వా రైతులకు విద్యుత్ బిల్లులు అధికంగా రావడంతో ఆక్వా రైతులు ఆందోళన చేశారు. ఈ-ఫిష్ నమోదు పరిస్థితిని ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు దృష్టికి ఆక్వా రైతులు తీసుకెళ్లారు. మత్స్యశాఖ అధికారులు స్పందించి మండలంలో కాళ్లకూరు, దొడ్డనపూడి గ్రామాల్లో ఈ-ఫిష్ నమోదు ప్రక్రియ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాళ్ల మత్స్యశాఖ అధికారి సిహెచ్.రాంబాబు మాట్లాడుతూ మండలంలో 22 వేల ఎకరాల్లో ఆక్వా సాగవుతోందన్నారు. విద్యుత్ సబ్సిడీ కోసం ఆక్వా రైతులు ఈ-ఫిష్ నమోదు చేయించుకోవాలన్నారు. ఎవరైతే ట్రాన్స్ ఫార్మర్ తీసుకున్నారో ఆ రైతు భూ వివరాలు ఈ ఫిష్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

క్రీడలు కాలక్షేపానికి కాకుండా దేశ ప్రగతికి పాటు పడేలా నైపుణ్యాన్ని ప్రదర్శించాలని, ఆటల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం కెజిఆర్ఎల్ కళాశాల క్రీడా మైదానంలో భీమవరం ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. క్రీడలు మానసికోల్లాసాన్ని, ఉత్సాహాన్ని అందిస్తాయన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ 10 రోజులపాటు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని, విజేతలకు రూ.లక్ష, రన్నర్స్‌కు రూ.50 వేలు అందిస్తామని తెలిపారు. ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, తోట భోగయ్య, కోడె యుగంధర్, కమిటీ సభ్యులు చుక్క కిషోర్, చందు, నర్సి పాల్గొన్నారు.

క్రికెట్ ఆడుతున్న ఎంఎల్‌ఎ శ్రీనివాస్

ఆవేదన వ్యక్తం చేస్తున్న ఆక్వా రైతులు

ఎక్కువ బిల్లు వచ్చిందని ఆక్వా రైతుల ఆవేదన

ప్రజాశక్తి - కాళ్ల

విద్యుత్, మత్స్యశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల అధిక మొత్తంలో విద్యుత్తు బిల్లులు వచ్చాయని ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాళ్లకూరులో అధిక విద్యుత్ బిల్లులు రావడంపై ఆక్వా రైతులు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆక్వా రైతులు మాట్లాడుతూ గతంలో సబ్సిడీ పోను రూ.50 వేలు వచ్చే విద్యుత్ బిల్లులు ప్రస్తుతం రూ.రెండు లక్షల నుంచి మూడు లక్షల రూపాయలు వచ్చాయన్నారు. కాళ్లకూర గ్రామంలో 39 మంది రైతులకు విద్యుత్ సబ్సిడీ తొలగించి, అధిక విద్యుత్ బిల్లులు వేయడం దారుణమన్నారు. ట్రాన్స్‌ఫర్లకు సంబంధించి ఫిషరీస్ అధికారులు ఈ-షిప్ నమోదు చేయకపోవడం వల్ల 39 మంది ఆక్వా రైతులకు ఆక్వా చెరువులకు సంబంధించిన విద్యుత్ బిల్లును విపరీతంగా పెంచి ఇచ్చారని ఆ బిల్లులు కట్టలేమని తెలిపారు. గత కొంత కాలంగా తమకు వస్తున్న విద్యుత్ సబ్సిడీలను ఈ షిప్ నమోదు కాలేదనే సాకుతో విద్యుత్‌పై సబ్సిడీ తొలగించి ఛార్జీలు విపరీతంగా పెంచి ఇవ్వటం జరిగిందన్నారు. రొయ్యల సాగులో సరైన గిట్టుబాటు ధరలేక తీవ్ర నష్టాల్లో ఉన్నామన్నారు. విద్యుత్తు, మత్స్యశాఖ అధికారులు, ప్రభుత్వం స్పందించి వెంటనే ఆక్వా రైతులకు ఈ - షిప్ నమోదు చేసి, తొలగించిన విద్యుత్ సబ్సిడీలను పునరుద్ధరించి సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో బొర్రా వీర వెంకట సత్యనారాయణ, తానుకొండ వెంకట్రావు, దండు ప్రణవమూర్తిరాజు, పెన్మెత్స పృధ్విరాజు, పెన్మెత్స సురేష్ రాజు, కె.నాగేశ్వరరావు, బొర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మండు వేసవిలో.. చల్లచల్లగా

దాతల సహకారంతో పలు చోట్ల చలివేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి - కాళ్ల

రోహిణీ కార్తె ప్రభావం వల్ల ఎండలు మండుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు ప్రభావం చూపుతున్నాడు. 41 డిగ్రీల నుంచి 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మధ్యాహ్నం వేళ బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. తప్పనిసరి పరిస్థితుల్లో వివిధ పనులపై బయటకొచ్చిన ప్రజలు, బాటసారులు, వాహనదారుల దాహార్తి తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకొస్తున్నాయి. మజ్జిగ, తాగునీరు అందిస్తూ ప్రజల దాహార్తిని తీరుస్తూ దాతృత్వాన్ని చాటుతున్నాయి.


కాళ్లకూరు గ్రామంలో దాట్ల శ్రీదేవి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రం

మజ్జిగ చలివేంద్రాలు..

మండలంలోని ఏలూరుపాడు, కాళ్లకూరు, సీసలి, పెదఅమిరం గ్రామాల్లో ప్రధాన కూడళ్లల్లో దేవాలయాల వద్ద పలువురు దాతలు మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేసి దాహార్తి తీరుస్తున్నారు.

సీసలి సాయిబాబా ఆలయం..

సీసలి సాయిబాబా ఆలయంలో ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఉగాది రోజున ఏర్పాటు చేసి ఇప్పటికీ నిర్వహిస్తున్నారు. ఎక్కువ ఎండ వేడిమి ఉన్నందున ఉదయం నుంచి సాయంత్రం వరకూ చల్లటి మజ్జిగ అందిస్తున్నారు. 16 సంవత్సరాల మజ్జిగ చలివేంద్రాన్ని ప్రతి వేసవిలో సీసలి షిరిడీ సాయిబాబా ఛారిటబుల్ ట్రస్టు ద్వారా నిర్వహిస్తున్నామని దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ ఛైర్‌పర్సన్ తోరం అనంతలక్ష్మి సత్యవతి దేవి తెలిపారు.

స్కాట్లాండ్ సెక్యూరిటీ సర్వీస్..

ఏలూరుపాడులో ఉన్న బస్‌షెల్టర్ వద్ద స్కాట్లాండ్ సెక్యూరిటీ సర్వీస్ సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని 40 రోజులుగా నిర్వహిస్తున్నారు. వేసవికాలంలో ప్రతి ఒక్కరి దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా ప్రతి రోజూ మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు అధినేత దాట్ల శ్రీనివాసరాజు తెలిపారు.

కాళ్లకూరు గ్రామంలో ప్రధాన రహదారిలో దాట్ల శ్రీదేవి ట్రస్ట్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మే నుంచి నిరంతరం చల్లని మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. కరివేపాకు, కొత్తిమీర, జీలకర్ర, అల్లం ఇతర వస్తువులతో రుచికరంగా మజ్జిగ అందిస్తున్నారు. ఎక్కడా రాజీ పడకుండా ఈ చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు ట్రస్టు అధినేత దాట్ల వెంకట రామరాజు తెలిపారు.

వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవాల అనంతరం దేవస్థానం వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని మే నుంచి నిర్వహిస్తున్నారు. జిల్లాలో ప్రసిద్ధి దేవాలయం కావడంతో నిత్యం యాత్రికుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ప్రతిరోజూ వందలాది యాత్రికులు, బాటసారులు, ప్రయాణికులు, వాహనదారులు ఈ చలివేంద్రం ద్వారా దాహార్తిని తీర్చుకుంటున్నారు. ఎండలు తగ్గేవరకూ చలివేంద్రం ఉంటుందని దేవస్థాన ఛైర్మన్ దండు వెంకట కృష్ణంరాజు తెలిపారు. పెదఅమిరంలో వేసవిలో వాహనదారులకు, పాదచారుల కోసం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాలు ఎంతో దోహదపడుతున్నాయి. గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రజలకు అందుబాటులో ప్రధాన రహదారి వెంబడి మజ్జిగచలి వేంద్రం ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారు.

1318 రకం సాగుకు రైతులు ఆసక్తి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రస్తుతం రైతులు సార్వా పంటకు ఎంటియు రైస్ 1318 సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారని మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థ ఎడిఆర్ డాక్టర్ ఎం.భరతలక్ష్మి అన్నారు. బుధవారం సంస్థలో మొదటి రోజు రైతులకు వివిధ రకాల విత్తనాలను విక్రయించారు. ఈ సందర్భంగా భరతలక్ష్మి మాట్లాడుతూ రైతులకు సంస్థ ద్వారా ఎంటియు రైస్ 1318, ఎంటియు 1262 (మార్టేరు మసూరి), ఎంటియు 3626 (ప్రభాత), పిఎల్ఎ 1100 (బాడవ మసూరి), ఎంటియు 1121 (శ్రీదతి) వంటి రకాల రైతుల ఎక్కువగా కొనుగోలు చేశారన్నారు. అలాగే తెలంగాణ రైతుల నుంచి పొడవైన సన్న రకం ఎంటియు రైస్ 1273, ఎంటియు రైస్ 1293, విడుదలకు సిద్ధంగా ఉన్న 1271, ఎంటియు 1282 రకాలను కూడా రైతులు ఎక్కువగా కొనుగోలు చేశారన్నారు. రైతులకు విత్తనాలు విక్రయాలు చేసే ప్రాంతాన్ని ఉదయం 10 గంటల 30 నిమిషాలకు మూత వేశారు. అయినప్పటికీ రైతులు ఎక్కువ శాతం రావడంతో గోడౌన్‌లో ఉన్న నిర్వాహకులు వారికి కావాల్సిన వారికి విత్తనాలు సరఫరా చేస్తూ, ముందుకొచ్చి వరుసలో నిలబడిన వారిని మాత్రం పట్టించుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు వేసవి తాకిడికి ఇబ్బంది పడ్డారు.

రైతులకు విత్తనాలు అందిస్తున్న ఎడిఆర్ భరతలక్ష్మి



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్య సిబ్బంది

పెదపుల్లేరులో ఫ్యామిలీ డాక్టర్

ఉండి:రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పెదపుల్లేరు గ్రామ సర్పంచి కరణం పార్వతి వెంకటేశ్వరరావు పరిశీలించారు. బుధవారం పెదపుల్లేరు గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచి కరణం పార్వతి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కనీస వైద్య సదుపాయాలు లేని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించడం అభినందనీయమన్నారు. గ్రామంలో అనారోగ్యంతో మంచాన పడిన వృద్ధులు, రోగుల ఇళ్లకు వెళ్లి డాక్టర్లు వైద్య సదుపాయాలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి బి.సాయి చంద్ర, సిహెచ్ఒ ఆర్.కృష్ణకుమార్, 104 సిబ్బంది, విలేజ్ హెల్త్ క్లీనిక్ సిబ్బంది పాల్గొన్నారు.

పోడూరు మండలంలో రీ సర్వే

ప్రజాశక్తి - పోడూరు

పోడూరు పరిసర గ్రామాల్లో బృందం బుధవారం ఏరియల్ రీ సర్వే నిర్వహించారు. డ్రోన్ సర్వే వల్ల వ్యవసాయ భూములకు అత్యంత పారదర్శకంగా హద్దులు నిర్ణయించడం జరుగుతుందని, ఈ ప్రక్రియ పూర్తయ్యాక భూములకు సరిహద్దు రాళ్లు కూడా వేసి రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాలు అందజేయడం జరుగుతుందని తహశీల్దార్ ఆర్‌వి.కృష్ణారావు తెలిపారు. మండలంలో రెండు రోజులపాటు డ్రోన్ సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. దాదాపు 100 ఏళ్ల తర్వాత అత్యంత పారదర్శకంగా ఈ సర్వే జరగడంతో మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అటు ప్రభుత్వానికి, ఇటు రైతాంగానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి రైతుల ప్రయోజనాల కోసం రూపకల్పన చేసిన జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకంలో భాగంగా మన భారత దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో మాత్రమే బృందావన రీ సర్వే ప్రక్రియ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గుంటూరు పెద్దిరాజు, ఎంపిపి సబ్బిత సుమంగళి సాగర్, వైస్ ఎంపిపి ఇందుకూరి సీతారామరాజు (చినబాబు), గ్రామ సర్పంచి శెట్టిబత్తుల సువర్ణరాజు, ఎఎంసి, మాజీ వైస్ ప్రెసిడెంట్ చెరుకూరు సూరిబాబు, రుద్రరాజు రమేష్‌బాబు పాల్గొన్నారు.

17 వరకూ అతిసార నిరోధక కార్యక్రమం

గణపవరం:గణపవరం పిహెచ్‌సిలోని అన్ని సచివాలయాల వద్ద ఈ నెల 17వ తేదీ వరకూ అతిసార నిరోధక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ పి.సంతోషనాయుడు చెప్పారు. ఐదేళ్లలోపు పిల్లలకు నీళ్ల విరోచనాలు అయితే వారికి ఒఆర్ఎస్‌తోపాటు జింకు మాత్రలతో వైద్యం అందిస్తామని చెప్పారు. తమ ఆసుపత్రి పరిధిలో 2091 మంది పిల్లలు ఉన్నారని చెప్పారు. వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ ఒజి.విల్సన్, బాబు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం మార్పులు చేయాలి

మొగల్తూరు:ఓటర్ల జాబితాలో పేర్లలో చేర్పులు మార్పులను నిబంధనల ప్రకారం చేయాలని తహశీల్దార్ జి.అనిత కుమారి సూచించారు. బుధవారం మొగల్తూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో బిఎల్‌ఓకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాంతరం వెళ్లిన, మరణించిన వారి పేర్ల తొలగింపు నూతన ఓటర్ల చేర్పులు పారదర్శకంగా చేయాలని సూచించారు.

ప్రభుత్వపరంగా ఆదుకుంటాం

ఆచంట: ఇటీవల ఈదురుగాలులకు, వర్షానికి నష్టపోయిన కుటుంబ సభ్యులను ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. కొడమంచిలి పంచాయతీ పరిధి కుక్కలవారిపాలెంలో సానబోయిన శ్రీనివాస్ ఇటీవల కొత్తగా కాయకష్టం చేసుకుని రేకుల షెడ్డుతో ఇల్లు నిర్మించుకున్నాడు. ఈ నేపథ్యంలో గత ఆదివారం రాత్రి భారీ ఈదురుగాలులకు రేకుషెడ్డు పైకప్పు ఎగిరిపోవడంతో తీవ్రంగా నష్టం వాటిల్లింది. ఈ సందర్భంగా బుధవారం ఆచంట ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆ ఇంటిని పరిశీలించి నష్టపోయిన కుటుంబసభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడి నష్టపరిహారం చెల్లించేందుకు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సుంకర సీతారామ్, విఆర్ఒ శేషగిరి పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కాంట్రాక్టు ఉద్యోగులు, కార్మికులతో పాటు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కర్రి నాగేశ్వరరావు, ధనాల వెంకట్రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్ అధికారంలోకి వచ్చే ముందు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను పర్మినెంట్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తామని చెప్పింది అమలు కాలేదన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులు, కార్మికులతో పాటు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు ఒకే పద్ధతిలో ఉన్నారని, అన్ని డిపార్ట్‌మెంట్లలో ఉన్న వారిని పర్మినెంట్ చేసి ఎన్నికల వాగ్దానాన్ని అమలు చేయాలని వారు తెలిపారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ అనే పేరుతో కార్మికులను, ఉద్యోగులను విడదీయకుండా పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.

సత్యనారాయణమ్మ మృతి తీరనిలోటు

ప్రజాశక్తి - వీరవాసరం

వైసిపి క్రియాశీలక నాయకురాలు మాజీ ఎంపిటిసి, మాజీ ఎఎంసి డైరెక్టర్ కడలి సత్యనారాయణమ్మ ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని ఎంఎల్‌ఎ గ్రంథి శ్రీనివాసరావు అన్నారు. రాయకుదురులో ఆమె కుటుంబ సభ్యులను బుధవారం ఎంఎల్‌ఎ పరామర్శించారు. ఆమె కుమారుడు ఎఎంసి డైరెక్టర్ కడలి ధర్మారావు, అల్లుడు భీమవరం జెడ్‌పిటిసి కాండ్రేకుల నరసింహారావు, భర్త సత్యనారాయణనను ఎంఎల్‌ఎ పరామర్శించి తన సానుభూతి తెలిపారు. కుటుంబంలో ఎవరైనా పెద్దదిక్కుపోతే ఆ బాధ తీరలేనిదన్నారు. అహర్నిశలూ వైసిపికి పని చేస్తున్న ధర్మారావు కుటుంబం మనోధైర్యంతో ఉండాలన్నారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన వెంట వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, భోగిరెడ్డి శ్రీనివాసరావు, నాగరాజు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.


ధర్మారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంఎల్‌ఎ గ్రంధి

కౌలు రైతుల సంఘం జాతాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - గణపవరం

ఈ నెల తొమ్మిదో తేదీన పిప్పర వస్తున్న కౌలు రైతు సంఘం రాష్ట్ర జాతాను జయప్రదం చేయాలని సంఘం మండల కమిటీ కార్యదర్శి పెచ్చెట్టి నరసింహమూర్తి పిలుపునిచ్చారు బుధవారం పిప్పరలో జరిగిన కౌలు రైతుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కౌలు రైతులకు భూ యజమాని సంతకం తప్పనిసరి కావడంతో యజమాని సంతకం చేయకపోవడంతో కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కౌలు రైతులకు కౌలు కార్డులు లేకపోవడంతో వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. రాష్ట్ర జాతా ఈ నెల 5వ తేదీన అనకాపల్లిలో బయలుదేరి జూన్ 12వ తేదీన విజయవాడ చేరుకుంటుందని తెలిపారు. కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న జాతాలో కౌలు రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బసవ ఎర్రినాయుడు, పిట్ట బాబూరావు పాల్గొన్నారు.


ఎంఎల్‌ఎ మంతెన రామరాజు సత్కరిస్తున్న పల్లిపాలెం గ్రామస్తులు

రహదారికి ఎంఎల్‌ఎ భూ వితరణ

ప్రజాశక్తి - కాళ్ల

పల్లిపాలెం గ్రామంలో అడ్డాల గ్రీక్ మురుగు కాలువ నుంచి వెళ్లే రహదారి అస్తవ్యస్తంగా ఉండేది. ఆక్వా రైతులు చెరువులకు వెళ్లేందుకు రైతులు అవస్థలు పడేవారు. ఈ మార్గంలో ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు స్థలం ఉంది. ఎన్నో ఏళ్ల నుంచి ఆక్వా రైతులు ఆక్వా పంటను రోడ్డుకు చేర్చేందుకు అవస్థలు పడుతున్నారు. ఈ పరిస్థితిని గమనించిన ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు 21 సెంట్ల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. ఈ రోడ్డులో కంకర్ రోడ్డు వేసేందుకు గ్రామస్తులు నిర్ణయించారు. పల్లిపాలెం గ్రామస్తులు రోడ్డుకు స్థలాన్ని విరాళంగా ఇచ్చిన ఎంఎల్‌ఎ మంతెన రామరాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బర్రె కనకరాజు, మాజీ సర్పంచి తిరుమాని మార్రాజు, తిరుమలశెట్టి భాస్కరరావు, తిరుమల శెట్టి బాలాజీ పాల్గొన్నారు.

పోలీసుల పహారా నడుమ

యథేచ్ఛగా మట్టి అక్రమ తరలింపు

ప్రజాశక్తి - యలమంచిలి

పోలీసుల ప్రహారా నడుమ మండలంలోని చించినాడ గ్రామంలో పేదల ఆధీనంలో ఉన్న లంకభూముల నుంచి పదుల సంఖ్యలో భారీ టిప్పర్ల ద్వారా అక్రమ మట్టి తరలింపు యథేచ్ఛగా జరుగుతోంది. దీనికి పగలూ రాత్రి వందల మంది పోలీసులు కాపలా కాస్తున్నారు. లంకల వైపు ఇతరత్రా పనులపై వెళ్లే సాధారణ ప్రజలను సైతం అటువైపు ఎందుకు వెళుతున్నారని ఆరా తీస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పలువురు చెబుతున్నారు.

మట్టి తరలిస్తున్న వైనం

అంగన్‌వాడీ కేంద్రానికి ప్యూరిఫైయర్ వాటర్ ఫిల్టర్ పంపిణీ

ప్రజాశక్తి - కాళ్ల

అంగన్‌వాడీ పిల్లలకు ప్యూరిఫైయర్ వాటర్ ఫిల్టర్ అందించేందుకు దాత శివ నాగరాజు ముందుకు రావడం అభినందనీయమని అంగన్‌వాడీ టీచర్ వేగేశ్న పద్మావతి అన్నారు. మాలవానితిప్ప అంగన్‌వాడీ కేంద్రానికి ప్యూరిఫైయర్ వాటర్ ఫిల్టర్‌ను దాత మంతెన శివనాగరాజు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయా, అంగన్‌వాడీ పిల్లలు పాల్గొన్నారు.

ఇఒపిఆర్‌డిగా మూర్తిబాబు

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట మండల పంచాయతీరాజ్ విస్తరణాధికారి, రూరల్ డెవలప్మెంట్ అధికారిగా (ఇఒపిఆర్‌డి) మూర్తిబాబు ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇఒపిఆర్‌డిగా పనిచేస్తూ నిడదవోలు మండలం నుంచి బదిలీపై ఆచంట వచ్చారు. ఈ సందర్భంగా మూర్తిబాబుకు పంచాయతీ కార్యదర్శులు జివివి సత్యనారాయణ, జివిఎన్ఎల్ నరసింహారావు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచంట పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కొండలరావును అరెస్టు చేయాలి

తణుకు రూరల్:అంగన్‌వాడీ కార్యకర్తను చంపిన కొండలరావును వెంటనే అరెస్టు చేయాలని శ్రామిక మహిళా జిల్లా నాయకురాలు ఎ.అజయకుమారి బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా టంగుటూరు ప్రాజెక్టు రాయవరం గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తను స్కూలు పిల్లల నీళ్ల కోసం బయటికి వెళ్లిన సందర్భంలో అదే గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త కొండలరావు నిర్లక్ష్యంగా ఆమెను ట్రాక్టర్‌తో గుద్ది చంపేశాడని తెలిపారు. విధుల్లో ఉన్న అంగన్వాడీ కార్యకర్తను చంపిన కొండలరావును వెంటనే అరెస్టు చేసి, ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆ కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కౌలు రైతుల చట్టాన్ని సవరించాలి

భీమవరం రూరల్:జగన్ తెచ్చిన కౌలురైతుల చట్టాన్ని సవరించాలని కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు తెలిపారు. భీమవరం మండలం తుందుర్రు గ్రామంలో బుధవారం కౌలురైతులతో మాట్లాడుతూ భూ యజమానుల సంతకంతో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చేవరకూ పోరాడాలన్నారు. జగన్ తెచ్చిన చట్టంతో భూ యజమానులు ఒప్పంద పత్రంపై సంతకం పెట్టలేదన్నారు. కనీసం పంట నమోదు కూడా చేయనివ్వడం లేదని, దీంతో కనీసం పండించిన పంట కూడా అమ్ముకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు చీడే చిన్న, మంచెం త్రిమూర్తులు, చీడే శ్రీనివాస్, యాతం సాంబశివరావు, ఎ.కాశీవిశ్వేశ్వరరావు, వలవల నారాయణరావు పాల్గొన్నారు.

In the Court of the Principal Junior Civil Judge, Tadepalligudem
O.S. 76/2023

Between:
Union Bank of India, Tadepalligudem
Rep. by its Chief Manager ...*Plaintiff*
AND
1. M/s. Balaji Dresses, Rep. by its Prop: Chappati Padmaja.
2. Chappati Padmaja ...*Defendants*

ప్రకటన

యిందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా, పై నంబరు గ్రంధములో శ్రీ కోర్టు వారు జారీ చేసిన సమన్లు త్రిప్పి పంపుచున్నందున పై నంబరు గ్రంధములో Substitute Service ద్వారా మీకు పేపరు ప్రకటన మూలముగా తెలియజేయునది ఏమనగా, పై నంబరు గ్రంధము **ది. 16-6-2023న వాయిదా అయి ఉన్నది. మీరు గాని, మీ తరపు ప్లీడరు గారి ద్వారా గాని ది. 16-6-2023న ఉదయం 10.30 ని॥లకు** పై శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు కావలసినది. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించడం జరుగునని ఈ ప్రకటన మూలముగా తెలియజేయడమైనది.

M.A.V.L.N.ACHARYULU
Advocate, Tadepalligudem
Cell: 9963230864

ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 128/2010

Between:
శ్రీధర బుచ్చి రామలింగేశ్వరరావు వగైరా -**వాదులు**
Vs
స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, పిప్పర, వగైరా -**ప్రతివాదులు**

పై నెంబరు దావాలో రెండవ ప్రతివాది శ్రీధర కాశీ వర విశ్వేశ్వరరావు గారు ది. 28-03-2020వ తేదీన ఇంటేస్టేట్‌గా చనిపోయినందున వారికి వారసులైన ఏడవ ప్రతివాది శ్రీమతి శ్రీధర విశాలాక్షి, భర్త: శ్రీధర కాశీ వర విశ్వేశ్వరరావు, డోర్ నెం. 5-133, వి.టి.ఛానల్ రోడ్, పైడిపర్రు, తణుకు మండలం మరియు తొమ్మిదవ ప్రతివాది శ్రీధర గురుప్రసాద్, తండ్రి: శ్రీధర కాశీ వర విశ్వేశ్వరరావు, డోర్ నెం. 5-133, వి.టి.ఛానల్ రోడ్, పైడిపర్రు, తణుకు మండలం అనువారు పై నెంబరు దావాలో కోర్టు ద్వారా ఎన్నిమార్లు దావా సమన్లు పంపినప్పటికీ తీసుకొననందున / evade చేయుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు యీ ప్రకటన ఇవ్వడమైనది. కావున సదరు ఏడవ ప్రతివాది శ్రీమతి శ్రీధర విశాలాక్షి మరియు తొమ్మిదవ ప్రతివాది శ్రీధర గురుప్రసాద్ అనువారు **ది. 23-06-2023వ తేదీన ఉదయం గం॥ 10.30 నిమిషములకు** పైన తెలిపిన కోర్టులో స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పరోక్షమున తీర్మానించబడునని తెలియపరచడమైనది.

తాడేపల్లిగూడెం **ధూళిపాళ సూర్య రామారావు**
తేది:05-06-2023 వాదులు తరపు న్యాయవాది

MUNICIPAL CORPORATION, ELURU
e-PROCUREMENT TENDER NOTICE No: 128-130/General/2023-24, Dated: 07-06-2023.
The Commissioner, Municipal Corporation, Eluru invites tenders from interested, eligible bidders for **"Supply Delivery Commissioning and Testing of Public Addressing System and PTZ Cameras, Illumination of JB Park and Engaging JCB & Labour for sanitation at various places in Municipal Corporation, Eluru"** Total No. of works is **3** with an amount of Rs. **14.71** Lakhs.
Tender schedules are available on e-procurement market place from 08-06-2023. Last date of receipt of tenders is 15-06-2023. Further details can be seen at e-procurement market place at **www.apeprocurement.gov.in** or contact Commissioner, Municipal Corporation, Eluru, Eluru District (Phone/ Fax: 08812-245990).
Sd/- **COMMISSIONER**
MUNICIPAL CORPORATION, ELURU